బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 11 మార్చి 2026 www.balagamtv.com పేజీలు 4

## నెలాఖరు కలా విధుల్లోకి 692 మంది వైద్యులు

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

ఆయా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ నెలాఖరు కల్లా 692 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్లు విధుల్లో చేరనున్నారు. అనస్తీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్ విభాగాల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల మెరిట్ లిస్టును మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం విడుదల చేసింది. 1:15 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. వెబ్‌సైట్‌లో షార్ట్ లిస్టులను పొందుపర్చింది. ఈ నెల 12, 13 తేదీల్లో హైదరాబాద్‌లోని వెంగళ్‌రావు నగర్‌లో గల ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్ఫేర్ కార్యాలయంలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ జరుగనున్నది. అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని వైద్యారోగ్య శాఖ అధికారులు సూచించారు. ఆ రెండు రోజుల్లో హాజరుకాలేకపోయినా, డాక్యుమెంట్లు పెండింగ్‌లో ఉన్నా మార్చి 16న (రిజర్వ్ డే) అందజేసేందుకు అవకాశం ఇచ్చింది. అప్పటికీ డాక్యుమెంట్లు చూపెట్టకపోతే వేరేవారికి అవకాశం ఇవ్వనున్నారు. ఫిబ్రవరి 19న నియామాలకు సంబంధించి అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయాలని ఎమ్‌హెచ్‌ఎస్ఆర్‌బీ సూచించిన విషయం విదితమే. అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత అనస్తీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్ విభాగాల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్, మెడికల్ ఆఫీసర్ స్పెషలిస్టుల పోస్టులకు సంబంధించి మెరిట్ జాబితాను బోర్డు విడుదల చేసింది. ఈ జాబితాల ఆధారంగా నోటిఫైడ్ ఖాళీలలో 1: 1.5 నిష్పత్తిలో దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను బోర్డు పరిశీలించనున్నది. షార్ట్-లిస్ట్ చేయబడిన దరఖాస్తుదారుల జాబితా బోర్డు సైట్‌లో పొందుపర్చింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత తుది మెరిట్ జాబితాను బోర్డు విడుదల చేయనున్నది.

# జల్ జీవన్ మిషన్ గడువు పొడిగింపు

- **రూ.8.69 లక్షల కోట్ల వ్యయంతో జేజేఎం 2.0కు కేంద్ర కేబినెట్ ఆమోదం**




బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

గ్రామీణ ప్రాంతాలకు సురక్షిత తాగునీటి సరఫరా లక్ష్యంగా అమలవుతున్న జల్ జీవన్ మిషన్ (జేజేవీ) పథకాన్ని 2028 డిసెంబర్ వరకు పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయానికి ఆమోదం లభించింది.

గ్రామీణ తాగునీటి రంగంలో నిర్మాణాత్మక సంస్కరణలపై దృష్టి సారిస్తూ జల్ జీవన్ మిషన్ అమలు విధానాన్ని పునర్వ్యవస్థీకరించాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రతిపాదించగా కేబినెట్ ఆమోదించింది. ఈ పథకం మొత్తం వ్యయాన్ని రూ.8.69 లక్షల కోట్లకు పెంచారు. ఇందులో కేంద్రం నుంచి ఇచ్చే సహాయాన్ని రూ.2.08 లక్షల కోట్ల నుంచి రూ.3.59 లక్షల కోట్లకు పెంచుతూ అదనంగా రూ.1.51 లక్షల కోట్లు కేటాయించారు. ఈ పథకం అమలులో పారదర్శకత కోసం "సుజలం భారత్" అనే జాతీయ డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌ను ప్రవేశపెట్టనున్నారు. దీని ద్వారా ప్రతి గ్రామానికి ప్రత్యేక "సుజల్ గావ్" లేదా సేవా ప్రాంత గుర్తింపు సంఖ్య కేటాయించి, నీటి మూలం నుంచి ఇంటి నళం వరకు మొత్తం తాగునీటి సరఫరా వ్యవస్థను డిజిటల్ మ్యాపింగ్ చేయనున్నారు.

గ్రామపంచాయతీలు మరియు గ్రామ జల, పారిశుద్ధ్య కమిటీలు నీటి సరఫరా పథకాల ప్రారంభం మరియు బాధ్యతల స్వీకరణలో భాగస్వామ్యం అయ్యేలా "జల్ అర్పణ్" కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. గ్రామంలో తగిన నిర్వహణ వ్యవస్థ ఏర్పాటయ్యిందని రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించిన తర్వాత గ్రామపంచాయతీ "హర్ ఘర్ జల్"గా ప్రకటించుకోవాల్సి ఉంటుంది.అలాగే గ్రామస్థుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రతి సంవత్సరం "జల్ ఉత్సవ్" పేరుతో సమీక్షా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.2019లో జల్ జీవన్ మిషన్ ప్రారంభమైనప్పుడు దేశంలో 3.23 కోట్ల (17 శాతం) గ్రామీణ కుటుంబాలకు మాత్రమే నళం ద్వారా తాగునీటి కనెక్షన్ ఉండేది. ప్రస్తుతం ఈ పథకం కింద మరో 12.56 కోట్ల కుటుంబాలకు అదనంగా కనెక్షన్లు అందించారు. దేశవ్యాప్తంగా గుర్తించిన 19.36 కోట్ల గ్రామీణ కుటుంబాల్లో ప్రస్తుతం సుమారు 15.80 కోట్ల (81.61 శాతం) కుటుంబాలకు నళం ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించినట్లు కేంద్రం తెలిపింది.

ఈ పథకం వల్ల మహిళలపై నీళ్లు మోయాల్సిన భారం గణనీయంగా తగ్గిందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఎస్‌బీఐ రీసెర్చ్ ప్రకారం సుమారు 9 కోట్ల మహిళలు నీళ్లు తెచ్చే బాధ్యత నుంచి విముక్తి పొందారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔఉఉ) అంచనాల ప్రకారం రోజుకు 5.5 కోట్ల గంటల సమయం ఆదా అవుతుండటంతో పాటు డయేరియా కారణంగా సంభవించే నాలుగు లక్షల మరణాలు నివారించబడే అవకాశం ఉందని పేర్కొంది. జల్ జీవన్ మిషన్ 2.0 ద్వారా 2028 డిసెంబర్ నాటికి దేశంలోని అన్ని 19.36 కోట్ల గ్రామీణ కుటుంబాలకు తాగునీటి నళ కనెక్షన్లు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల తాగునీటి సరఫరా సాధించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

**ఎఫ్‌డీఐ నిబంధనల్లో కేంద్రం సడలింపు**

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తో భూసరిహద్దు పంచుకునే దేశాల నుంచి వచ్చే పెట్టుబడులపై అమల్లో ఉన్న కొన్ని నిబంధనలను సడలిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.ఈ నిర్ణయంతో చైనా సహా పలు పొరుగు దేశాల నుంచి వచ్చే పెట్టుబడులపై అమల్లో ఉన్న కొన్ని పరిమితులను సవరించినట్లు తెలుస్తోంది. 2020లో అమల్లోకి తీసుకువచ్చిన ప్రెస్ నోట్--3 నిబంధనల్లో కేంద్రం మార్పులు చేసింది. ఈ నిబంధనల ప్రకారం భారత్‌తో భూసరిహద్దు కలిగిన దేశాలకు చెందిన కంపెనీలు లేదా ఆ దేశాల షేర్ హోల్డర్లు ఉన్న సంస్థలు భారత్‌లో ఏ రంగంలోనైనా పెట్టుబడి పెట్టాలంటే తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. తాజాగా ఈ నిబంధనల్లో కొంత సడలింపు కల్పించినట్లు సమాచారం.

భారత్‌తో భూసరిహద్దు పంచుకునే దేశాల్లో చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, అఫ్గానిస్థాన్ ఉన్నాయి. ఇప్పటివరకు ఈ దేశాల నుంచి వచ్చే పెట్టుబడులు కఠిన నియంత్రణల కింద కొనసాగుతున్నాయి. 2020 జూన్‌లో లద్దాఖ్‌లోని గల్వాన్ లోయ వద్ద భారత్--చైనా సైన్యాల మధ్య జరిగిన ఘర్షణ తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఆ ఘటన అనంతరం విదేశీ పెట్టుబడుల విషయంలో జాతీయ భద్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ప్రెస్ నోట్--3ను అమల్లోకి తీసుకువచ్చింది. దీని ద్వారా ముఖ్యంగా చైనా కంపెనీలు భారతీయ సంస్థల్లో పెట్టుబడులు పెంచడాన్ని నియంత్రించాలనే లక్ష్యంతో ఈ నిబంధనలు అమలు చేశారు. అదే సమయంలో డేటా భద్రత, జాతీయ భద్రత కారణాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం 200కు పైగా చైనా మొబైల్ యాప్‌లను కూడా నిషేధించింది. వాటిలో టిక్‌టాక్, వీచాట్, యూసీ బ్రౌజర్ వంటి ప్రముఖ యాప్‌లు ఉన్నాయి.

### చమురు సరఫరాపై
# ఆందోళన అవసరం లేదు

- **కేంద్ర ప్రభుత్వ వర్గాలు**
- **40 దేశాల నుంచి చమురు దిగుమతులు**
- **ఎల్పీజీ ఉత్పత్తి 10% పెరిగిందని వెల్లడి**



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో చమురు సరఫరాపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. దేశీయ అవసరాలను తీర్చేందుకు ప్రస్తుతం 40 దేశాల నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్నట్లు కేంద్రం తెలిపింది. గతంలో 27 దేశాల నుంచే చమురు కొనుగోలు చేసేవారని, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని దిగుమతులను 40 దేశాలకు విస్తరించినట్లు వెల్లడించింది.

ఈ విషయంపై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఇప్పటికే పలు చమురు సరఫరా దేశాలతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. దేశానికి అవసరమైన చమురు సరఫరాను వీలైనంత త్వరగా అందించాలని ఆయా దేశాలను కోరినట్లు కేంద్ర వర్గాలు తెలిపాయి. కొంతమంది సరఫరా దేశాలు ఇప్పటికే చమురు పంపిణీ ప్రారంభించినట్లు కూడా వెల్లడించారు. అదేవిధంగా దేశంలో ఎల్పీజీ ఉత్పత్తి కూడా సుమారు 10 శాతం పెరిగిందని కేంద్రం పేర్కొంది. అయితే కేంద్రం నుంచి వచ్చిన ప్రకటనలు సానుకూలంగా ఉన్నప్పటికీ ప్రజల్లో మాత్రం చమురు సరఫరాపై ఇంకా అనుమానాలు కొనసాగుతున్నాయి.

ఇక కమర్షియల్ గ్యాస్ సరఫరాపై కొన్ని ప్రాంతాల్లో ఆంక్షలు అమల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల లభ్యత తగ్గడంతో రెస్టారెంట్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే రెస్టారెంట్లను మూసివేయాల్సి వచ్చే అవకాశముందని రెస్టారెంట్లు, హోటళ్ల సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా తగినంతగా లేకపోతే రెస్టారెంట్ రంగానికి రోజుకు రూ.1,200 కోట్ల నుంచి రూ.1,300 కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) వైస్ ప్రెసిడెంట్ జోరావర్ కర్లా తెలిపారు. ప్రస్తుతం దేశంలోని సుమారు 75 శాతం రెస్టారెంట్లు ఎల్పీజీ సిలిండర్లపైనే ఆధారపడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇక ఎల్పీజీ కొరత నేపథ్యంలో ఢిల్లీలోని కొన్ని రెస్టారెంట్లు తమ మెనూలో మార్పులు చేస్తున్నాయి. గ్యాస్ ఎక్కువగా అవసరమయ్యే వంటకాలను జాబితా నుంచి తొలగిస్తూ, ఎల్పీజీ సిలిండర్లకు బదులుగా ఎలక్ట్రిక్ కుక్కర్లను ఉపయోగిస్తూ వంటలు చేయడం ప్రారంభించినట్లు సమాచారం.

# పారదర్శక భూ సేవలే లక్ష్యం



- **భూముల రీ--సర్వేకు ఆధునిక 'రోవర్ల' వినియోగంలిలి**
- **2026--27 బడ్జెట్‌లో ప్రత్యేక నిధుల ప్రతిపాదనలు**
- **మంత్రి పొంగులేటి**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో భూ లావాదేవీలను మరింత పారదర్శకంగా నిర్వహించి ప్రజలకు, ముఖ్యంగా రైతులకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లూ అధ్యక్షతన జరిగిన 2026--27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని తగ్గించేందుకు రెవెన్యూ, స్టాంప్స్ ఱ రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.పాత విధానాలకు స్వస్తి చెప్పి అత్యాధునిక 'రోవర్' పరికరాలతో భూముల సర్వే నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రతి మండలానికి ఒకటి చొప్పున 460 రోవర్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. రాబోయే బడ్జెట్‌లో మరో 400 రోవర్ల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు.

రాష్ట్రంలో నక్షా (మ్యాప్) లేని 373 గ్రామాల్లో త్వరలోనే భూముల రీ--సర్వే చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం 2026--27 బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రిని కోరినట్లు చెప్పారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఆర్డీవో (క్షుణఉ), తహసీల్దార్ కార్యాలయాలకు శాశ్వత ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు కూడా బడ్జెట్ కేటాయింపులు అవసరమని విజ్ఞప్తి చేశారు. రెవె న్యూ, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొని శాఖల వారీగా నిధుల అవసరాలపై చర్చించారు.

### అవయవ మార్పిడి చికిత్సలకు
# సమగ్ర పాలసీ రూపకల్పన

- **వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**
- **ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక ఛార్జీలపై మంత్రి ఆగ్రహం**



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అవయవ మార్పిడి చికిత్సలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు సూచించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ ఆక్ట్ (ఎఉఉూ) పాలసీ రూపకల్పన, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని మంత్రి నిర్వహించారు.

ఈ సందర్భంగా అవయవ మార్పిడి చికిత్సలపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో మంత్రి చర్చించారు. అవయవ దానాలను ప్రోత్సహించేందుకు విధివిధానాలను సరళీకృతం చేయాలని అధికారులను ఆదేశించారు. అవయవ మార్పిడి చికిత్సల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో అవయవ మార్పిడి చికిత్సలపై అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న అంశంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులు కూడా ఈ చికిత్సలను పొందగలిగే విధంగా ధరల నియంత్రణ ఉండాలని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు సూచించారు. మంత్రి చేసిన సూచనలకు ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. దాతలు అందించిన అవయవాలు వృథా కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆసుపత్రులకు మంత్రి సూచించారు. ఇతర దేశాల నుంచి అవయవ మార్పిడి కోసం వచ్చే రోగులకు అనుకూలంగా కొత్త విధివిధానాలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో చేతి మార్పిడి చికిత్సల కోసం నాలుగు ఆసుపత్రులకు ఇప్పటికే అనుమతులు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.ఇక రాష్ట్రంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స ఖర్చులు సామాన్యులకు భారం కాకుండా ఉండేలా టారిఫ్ నియంత్రణపై చర్యలు ప్రారంభించామని తెలిపారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరేంద్ర కుమార్, జీవన్ దాన్ డైరెక్టర్ డా. శ్రీభూషణ్ రాజ్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా. అజయ్ కుమార్ తదితర అధికారులు, వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు మరియు ప్రతినిధులు పాల్గొన్నారు.



# తెలంగాణ నూతన గవర్నర్‌కు ఘన స్వాగతం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లా రాష్ట్రానికి విచ్చేసిన సందర్భంగా హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సీఎం అభినందనలు తెలిపారు. గవర్నర్‌కు స్వాగతం పలికిన వారిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, డీజీపీ శివధర్ రెడ్డి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీల చట్టబద్ధతకు ప్రయివేటు బిల్లు



- **బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తాం**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **గోల్కొండ రిసార్ట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఓరియంటేషన్ సమావేశం**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని, రాబోయే బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలంగా నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. గండిపేటలోని గోల్కొండ రిసార్ట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఓరియంటేషన్ సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ మూడవదని, బడ్జెట్ సమావేశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు వైఫల్యాన్ని అసెంబ్లీలో ఎండగట్టేందుకు వ్యూహరచనపై ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

అసెంబ్లీలో ఇప్పటివరకు స్టాండింగ్ కమిటీలు, సెలెక్ట్ కమిటీలు, పిటిషన్స్ కమిటీలు ఏర్పాటు చేయలేదని, డిప్యూటీ స్పీకర్ పదవి కూడా ఖాళీగా ఉందని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వం బలవంతంగా శాసనసభ సమావేశాలను నిర్వహిస్తున్నదని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పినా ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ తరపున ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఆ బిల్లుకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతులకు ఇవ్వాల్సిన రైతు బంధును పక్కనపెట్టి ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ఖమ్మం ప్రాంతంలో ఇళ్లు కోల్పోయిన బాధితులు, మూసీ బాధితులు, పేద దళిత, గిరిజన వర్గాల తరపున అసెంబ్లీలో ప్రభుత్వం పై ప్రశ్నలు లేవనెత్తుతామని తెలిపారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, అయితే ఆ పేరుతో భారీ అవినీతి జరుగుతుందని ఆరోపించారు. ఒకవైపు నిధుల కొరత ఉందని చెబుతూ మరోవైపు భారీ ప్రాజెక్టులకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు.ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు మధుసూదనాచారి, బండ ప్రకాశ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొని బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మాట్లాడారు.

# బాసర నుంచి భద్రాచలం వరకు...

## ఒక సర్క్యూట్ గా దేవాలయాల అభివృద్ధికి ప్రణాళికలు

- **గోదావరి పుష్కరాల కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రి పొంగులేటి**



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఏడాది జరుగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న అన్ని ప్రధాన ఆలయాలు, పురాతన ఆలయాలను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు తయారు చేయాలని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన గోదావరి పుష్కరాల కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి సమగ్ర రోడ్ల అనుసంధానం కల్పించే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు.

రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే విధంగా ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని మంత్రి పేర్కొన్నారు. అవసరమైన చోట రోడ్ల నిర్మాణం, అభివృద్ధి కోసం ఎంత మేర నిధులు అవసరమో ఆర్థిక పరమైన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. బాసర, భద్రాచలం, కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయం వంటి ప్రసిద్ధ క్షేత్రాలే కాకుండా మధ్యలో ఉన్న ఇతర ప్రముఖ దేవాలయాలకు కూడా సౌకర్యవంతమైన రోడ్ల కనెక్టివిటీ కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రణాళిక రూపొందించాలని మంత్రి తెలిపారు. ప్రధాన రహదారులతో దేవాలయాలను అనుసంధానం చేస్తూ ఒకేసారి సమగ్ర ప్రణాళిక అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. బాసర దేవాలయానికి ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఆమోదం ఉన్నందున, భద్రాచలం దేవస్థానం మాస్టర్ ప్లాన్ ను కూడా ఈ కమిటీలో చర్చించి ముఖ్యమంత్రి గారి ఆమోదం తీసుకోవాలని అన్నారు.



# కవిత అరెస్ట్..
## హైదరాబాద్‌కు తరలింపు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఖమ్మంలోని అంబేద్కర్ భవన్‌లో వెలుగుమట్ల బాధితులకు మద్దతుగా డీఎస్పీ అధ్యక్షులు విశారదన్ మహారాజ్‌తో కలిసి సోమవారం రాత్రి నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు మంగళవారం ఉదయం అరెస్ట్ చేశారు. కవితతో పాటు దీక్ష చేస్తున్న వారిని పోలీసులు హైదరాబాద్ తరలించారు. అరెస్టు చేసినా దీక్ష కొనసాగిస్తానని కవిత స్పష్టం చేశారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం జరిగే వరకూ దీక్ష సాగిస్తానని అన్నారు. ప్రభుత్వం దిగివచ్చి కూల్చేసిన చోటనే బాధితులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొత్తం 600 మంది పోలీసులు దీక్షా శిబిరాన్ని చుట్టుముట్టి అరెస్టు చేయడాన్ని ఆమె ఖండించారు.

# లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. మంగళవారం కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టగా, అనంతరం దీనిపై చర్చ ప్రారంభమైంది. చర్చ కోసం సభలో మొత్తం 10 గంటల సమయం కేటాయించారు.ఈ తీర్మానంపై చర్చ సందర్భంగా సభను నడిపేందుకు ప్రత్యేక సభాపతిని నియమించాలని విపక్షాలు కోరాయి. దీనికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో సీనియర్ ఎంపీ, ఛైర్‌పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్‌ను ప్రత్యేక స్పీకర్‌గా నియమించారు. ఆయన అధ్యక్షతన అవిశ్వాస తీర్మానంపై చర్చ కొనసాగుతోంది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులను సస్పెండ్ చేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై చర్యలు తీసుకోకపోవడం వంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చాయి.ఈ తీర్మానానికి మద్దతుగా 118 మంది ఎంపీల సంతకాలు సేకరించినట్లు సమాచారం. చర్చ అనంతరం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. తీర్మానం ఆమోదం పొందాలంటే సాధారణ మెజారిటీ అయిన 272 ఓట్లు అవసరం. ప్రస్తుతం లోక్‌సభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు 293 మంది ఎంపీల మద్దతు ఉండగా, ప్రతిపక్షాలకు 238 మంది ఎంపీలు ఉన్నారు. దీంతో ఈ తీర్మానం ఆమోదం పొందే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హతపై నేడు తీర్పు

**బలగం టీవీ, హైదరాబాద్**



బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిల అనర్హతపై నేడు తేలనుంది. వీరిద్దరిపై దాఖలైన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ బుధవారం ఉదయం 10 గంటలకు తీర్పు వెల్లడించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిలో దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పీకర్‌కు పిటిషన్ దాఖలు చేశారు. అలాగే స్టేషన్ ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించిన కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని ప్రశ్నిస్తూ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అనర్హత పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 12న ఎమ్మెల్యేల అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరగనున్న నేపథ్యంలో, దానికంటే ముందే ఈ పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ నిర్ణయించినట్లు సమాచారం. దీంతో స్పీకర్ తీర్పుపై రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి నెలకొంది.

## మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్**



స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్‌బండ్‌పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించిన మిలియన్ మార్చ్‌కు నేటితో 15 ఏళ్లు పూర్తయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన కీలక ఘట్టాల్లో మిలియన్ మార్చ్ ఒకటని ఆయన పేర్కొన్నారు. 2011 మార్చి 10న జరిగిన మిలియన్ మార్చ్ సందర్భంగా ప్రభుత్వం విధించిన నిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు, బ్యారికేడ్లు, ఇనుపకంచెలు కూడా తెలంగాణ ఉద్యమకారుల స్ఫూర్తిని అడ్డుకోలేకపోయాయని కేటీఆర్ తెలిపారు. లక్షలాది మంది ప్రజలు ట్యాంక్‌బండ్‌పై గుమికూడి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నినదించిన అద్భుత పోరాట రూపానికి నేటితో 15 ఏళ్లు పూర్తయ్యాయని ఆయన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. తెలంగాణ అమరవీరులకు జోహార్లు, జై తెలంగాణ అంటూ ఆయన తన సందేశాన్ని ముగించారు. మిలియన్ మార్చ్ సందర్భంగా తీసిన కొన్ని ఫొటోలను కూడా కేటీఆర్ తన పోస్టులో షేర్ చేశారు.

## వెలుగుమట్ల బాధితులకు నేడు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు

### 331 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

**బలగం టీవీ, ఖమ్మం**

ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్లలో వినోభా నగర్ కాలనీలో నుంచి ఖాళీ చేయించిన 331 కుటుంబాలకు ఇళ్ల స్థల పత్తాలు, ఇండిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు ఇవ్వనున్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లబ్ధిదారులకు పత్తాలు, మంజూరు పత్రాలు అందజేయనున్నారు.

వినోభా నవోదయ భూదాన్ కాలనీ నుంచి ఎంపికైన లబ్ధిదారులకు అధికారులు మంగళవారం సాయంత్రం నుంచే టోకెన్లు పంపిణీ చేయడం ప్రారంభించారు. అయితే ఈ కుటుంబాలకు కేటాయించనున్న ఇళ్ల స్థలాల స్థానం గురించి అధికారులు గోప్యత పాటిస్తున్నట్లు సమాచారం. ఇటీవల భూదాన్ భూములపై నివసిస్తున్న కుటుంబాలను ఖాళీ చేయించడంతో ఇళ్లను కోల్పోయిన ఈ కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, ఇండిరమ్మ ఇళ్ల మంజూరు ద్వారా సహాయం అందించనుంది.

## యుద్ధానికి సిద్ధమే.. ముగింపు మా చేతుల్లోనే: ఇరాన్ హెచ్చరిక

**బలగం టీవీ, హైదరాబాద్**



యుద్ధానికి త్వరలో ముగింపు లభించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొంటున్న నేపథ్యంలో, ఇరాన్ మాత్రం భిన్నమైన ధోరణిని వ్యక్తం చేసింది. అవసరమైతే యుద్ధాన్ని దీర్ఘకాలం కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అలీ అరాగ్చి స్పష్టం చేశారు. అమెరికా గత రెండు దశాబ్దాలుగా వివిధ దేశాలపై చేసిన యుద్ధాలను, ఆ యుద్ధాల్లో అమెరికా సైన్యం ఎదుర్కొన్న పరిస్థితులను తాము సవివరంగా అధ్యయనం చేస్తున్నామని ఆయన తెలిపారు. తమ రాజధాని టెహ్రాన్‌పై బాంబు దాడులు జరిగినా ఇరాన్ సామర్థ్యంపై ఎలాంటి ప్రభావం ఉండదని అన్నారు. యుద్ధం ఎప్పుడు, ఎలా ముగుస్తుందో ఇప్పుడే చెప్పలేమని, అయితే దాని ముగింపును నిర్ణయించేది ఇరానే అవుతుందని అరాగ్చి పేర్కొన్నారు.

ఇక ఇరాన్ భద్రతా అధికారి అలీ లారిజాని కూడా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా నుంచి వచ్చే గాలి హెచ్చరికలకు ఇరాన్ భయపడబోదని ఆయన అన్నారు. “20 రెట్లు కాదు, అంతకంటే ఎక్కువ శక్తితో వచ్చినా ఇరాన్‌ను తుడిచిపెట్టలేరు” అని స్పష్టం చేశారు. తమపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు మానుకోవాలని సూచిస్తూ, “మీ అధ్యాయం ముగిసిపోకుండా చూసుకోండి” అంటూ ట్రంప్‌కు లారిజాని హెచ్చరిక చేశారు.

## హైదరాబాద్‌కు ధీటుగా వరంగల్ అభివృద్ధి

- **జూన్ నాటికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం లక్ష్యం**
- **భూగర్భ డ్రైనేజీ పనులకు త్వరలో టెండర్లు**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**




వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు ధీటుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధిపై దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కే.ఆర్ నాగరాజు, నాయిని రాజేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హన్మకొండ కలెక్టర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరంగల్ నగర అభివృద్ధి పనులను వేగవంతం చేసి జూన్ 2 నాటికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టిన ముఖ్య పనులను పూర్తి చేయాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు.

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో జూన్ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆసుపత్రి తుదిదశ నిర్మాణ పనులు, వైద్య పరికరాల ఏర్పాటు, డాక్టర్లు మరియు ఇతర సిబ్బంది నియామకాలకు త్వరగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే వరంగల్ పట్టణంలో రూ.5,257 కోట్ల వ్యయంతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టుకు త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి వచ్చే నెలలో పనులు ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.

భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులు, ఆలయ మాడవీధుల్లో కృష్ణశిల నిర్మాణాలు, భద్రకాళి చెరువు డీసిల్టేషన్, హెడ్ రెగ్యులేటర్ వద్ద ఇన్ ఫాల్, అవుట్ ఫాల్ నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలని సూచించారు. ఇన్నర్ రింగ్ రోడ్, అవుటర్ రింగ్ రోడ్ నిర్మాణాలు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అసంపూర్తిగా ఉన్న 2బిహెచ్‌కే ఇండ్లకు ఈ నెల 31లోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి, 2బిహెచ్‌కే కాలనీల్లో కనీస వసతుల ఏర్పాటుకు అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు సమానంగా అభివృద్ధి చేయాలని కృతనిశ్చయంతో పనిచేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## డిప్యూటీ స్పీకర్ నియామకం ఎందుకు లేదు?

- **కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది**
- **హరీశ్ రావు**

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ ఎన్నిక నిర్వహించకపోవడం రాజ్యాంగ శూన్యత కాదా అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ విషయంపై కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజ్యాంగం గురించి గొప్పలు చెప్పే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాల్లో మాత్రం అదే రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నదని హరీశ్ రావు విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కించపరచడంలో కాంగ్రెస్, బీజేపీలు ఒకే నాణేనికి రెండు వైపుల్లా వ్యవహరిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని ఏడేళ్లుగా ఖాళీగా ఉంచడాన్ని రాజ్యాంగ శూన్యతగా పేర్కొన్న పీఏసీ చైర్మన్ కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యలు హాస్యాస్పదమని హరీశ్ రావు అన్నారు. అదే సూత్రం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి వర్తించదా అని ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు కావొస్తున్నప్పటికీ అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ పదవిని ఎందుకు భర్తీ చేయడం లేదని ఆయన నిలదీశారు. ఢిల్లీలో రాజ్యాంగ పరిరక్షణపై మాట్లాడే రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తెలంగాణలో జరుగుతున్న రాజ్యాంగ ఉల్లంఘనపై సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలనే కాంగ్రెస్ తెలంగాణలో అమలు చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరచడంలో పోటీ పడుతున్నాయని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, రాజ్యాంగబద్ధమైన పదవులను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ప్రజలకు సమాధానం చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## రైతుల అరెస్టులు అన్యాయం: బండి సంజయ్

**బలగం టీవీ, హైదరాబాద్**



తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రైతులు నిరసన ప్రదర్శన చేస్తే వారిని నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేయడం సరైంది కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలాలకు సాగునీరు అందించే కాలువ పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రశ్నించారు. ఈ పనులకు రూ.3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది గడిచినా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదని విమర్శించారు.

కాలువ పనులు పూర్తయి ఉంటే సుమారు 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాల వల్ల రైతులు వరుసగా పంట నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో రంగనాయక్ సాగర్ ద్వారా సిరిసిల్ల జిల్లాకు నీరు అందించలేదని, ఇప్పుడు అదే విషయంపై కేటీఆర్ మాట్లాడటం ఆశ్చర్యకరమని ఆయన విమర్శించారు. ఈ ప్రాజెక్టు పనులు వెంటనే ప్రారంభించకపోతే ఆ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని అడిగిన రైతులను అరెస్టు చేయడం అన్యాయమని విమర్శిస్తూ వెంటనే వారిని విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులపై కేసులు నమోదు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు.



## 13న పీఎం కిసాన్ 22వ విడత నిధులు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశంలోని కోట్లాది మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన 22వ విడత నిధులను ఈ నెల 13న రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

దేశవ్యాప్తంగా సుమారు 9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున నేరుగా జమ చేయనున్నారు. అస్సాంలోని గువాహటిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నిధులను విడుదల చేయనున్నట్లు వ్యవసాయశాఖ ఉన్నతాధికారి వెల్లడించారు. పీఎం కిసాన్ పథకం కింద ప్రతి సంవత్సరం మూడు విడతలుగా రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేల ఆర్థిక సహాయాన్ని రైతులకు అందిస్తున్నారు. ఈ విడతలో సుమారు రూ.19 వేల కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది నవంబర్ 19న 21వ విడత పీఎం కిసాన్ నిధులను విడుదల చేశారు. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 11 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి..




- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, వేములవాడ:**

పశువుల సంరక్షణకు పెంపకందారులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పకుండా వేయించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమాన్ని పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాల కేంద్రం ఆవరణలో మంగళ వారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై ప్రారంభించారు. పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పాల కేంద్రాన్ని పరిశీలించి గ్రామంలో ఎన్ని పాడి పశు వులు ఉన్నాయి? ఎన్ని లీటర్ల పాలు వస్తాయి? ఎక్కడ విక్రయిస్తారు అనే వివరాలను పాల కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామంలో కొనసాగుతున్న పనులపై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రోగాల బారిన పడిన పాడి పశు వులు పాలు తక్కువ ఇస్తాయని,పాలు, పాల ఎగుమతుల పై ఆ ప్రభావం పడుతుందని, పెంపకందారులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందని అన్నారు. పెంపకం దారులు తమ జీవాల ఆరోగ్య సంరక్షణ, ఆర్థికంగా నష్ట పోకూడదనే ఉద్దేశంతో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ప్రభుత్వం ఉచితంగా వేయిస్తుందని అన్నారు. పెంపకం దారులు ముందస్తుగా టీకాలు వేయించి.. ఆ రోగాల బారి నుంచి తమ జీవాలను రక్షించాలని సూచించారు. అన్ని పాడి పశువులు, ఎద్దులు, దూడలకు పశువుల పెంపకందారులు, రైతులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని, జిల్లాలో 97 వేల జీవాలు ఉన్నాయని, పశు వైద్య డాక్టర్లు, సిబ్బంది 26 టీమ్ లుగా ఏర్పడి వచ్చే నెల ఏప్రిల్ 9వ తేదీ వరకు టీకాలు వేస్తారని అన్నారు.

ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో జిల్లాలోని అన్ని గ్రామాలు, రెండు మున్సిపా లిటీల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నారని అన్నారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టి న ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి.. గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. మహిళా సమాఖ్య భవనాల నిర్మాణ పనులు వేగంగా పనులు చేపట్టి.. జూన్ 2వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. యూత్ అండ్ స్పోర్ట్స్ ఆధికారి ఆధ్వర్యంలో యువతకు 5కే రన్, ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో జాబు మేళాలు చేపడుతారని తెలిపారు. వ్యవ సాయ, విద్యా శాఖ, అటవీ శాఖ, డీఆర్డీఓ వివిధ శాఖల ఆధ్వర్య ంలో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక లో భాగంగా చేపడుతున్న పనుల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి బారిన పడిన జీవాల శరీర ఉష్ణోగ్రత 104 ఫీ -- 1060 ఫీ పెరిగి పశువులు నీరసించి పోతాయని, పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని, వాటి నోరు అలాగే గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి, 24 గంటల్లో చితికిపోయి పొక్కులు, పుండ్లుగా మారి నొప్పి వలన పశువులు మేత నీరు తీసుకోక నీరసించి చనిపోయే ప్రమాదం ఉందని అన్నారు . పశువుల పాకలను శుభ్రంగా ఉండాలని సూచించారు. టీకాలు వేసి గుర్తింపు కొరకు చెవి పోగు వేయించి ఆ వివరాలు భారత్ పశుధాన్ యాప్ లో నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూది మనీషా, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఎంపీడీఓ రాధ, పశు వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు ఆందోళనకరం..



- బీఆర్ఎస్వీ నాయకుడు కంచర్ల రవి గౌడ్ ఆగ్రహం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత చౌక్ వద్ద గురుకుల విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలను ఖండిస్తూ టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు గురుకుల బాలికల వసతి గృహంలో కలుషిత ఆహారం కారణంగా సుమారు 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. రాష్ట్రంలో గురుకుల విద్యాసంస్థల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గురుకుల విద్యా వ్యవస్థ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అదే వ్యవస్థ దెబ్బతింటోందని అన్నారు.

ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉండటం బాధాకరమని విమర్శించారు. గురుకుల విద్యాసంస్థల్లో ఆహార నాణ్యతపై ప్రభుత్వం వెంటనే సమీక్ష నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఎక్కడ అన్యాయం జరిగినా కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం గురుకుల వ్యవస్థను మెరుగుపరచాలని, లేకపోతే విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె. అప్రోచ్, అరికెల వినయ్ కుమార్, మార్గం కార్తికేయ, సాయి నవీన్, ఎస్.కె జుబేర్, లింగంపల్లి అబ్బి, అనురిత్, శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

# నిరుపయోగ వస్తువులు, పరికరాలు తొలగించాలి..

- రికార్డులు, ఫైళ్లు నిబంధనల ప్రకారం భద్రపరచాలి.
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రతి ప్రభుత్వ కార్యాలయం నిరుపయోగ వస్తువులు, పరికరాలు తొలగించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం స్వచ్ఛత.. పరిశు భ్రత కార్యక్రమాన్ని నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై తనిఖీ చేశారు.గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్‌లోని నీటి పారుదల శాఖ, బీసీ సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, భూగర్భ శాఖ, వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ, ఉపాధి కల్పన శాఖ, ట్రెజరీ, జిల్లా పంచాయతీ కార్యాలయం తదితర శాఖల కార్యాలయాలనుకలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లోని వివిధ గదుల్లో ఉన్న ఫర్నిచర్, ఫైల్స్, రికార్డులు, సామగ్రి పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లా శాఖ కార్యాలయం, మండలాల్లోని కార్యాలయాలు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యాలయంలోని ఫైళ్లు, రిజిస్టర్లు స్టోర్ రూమ్ లా సిద్ధం చేయాలని, నిబంధనల ప్రకారం భద్రపరచాలని అన్నారు . అనవసరమైనవి తొలగించాలని సూచించారు. కార్యాలయం ఆవరణలోని నిరుపయోగ వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు తొలగించాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న కుండీల్లో మొక్కలు పెట్టించాలని తెలిపారు.

# బతుకుబండిని లాగలేక విలవిలలాడుతున్న దివ్యాంగుడు

- కన్నీటి గాథగా మారిన వికలాంగుడి జీవితం
- ఉపాధి ఇచ్చి “మా కుటుంబాన్ని కాపాడండి”



**బలగం టీవీ, వేములవాడ:**

జీవితం ఇప్పటికే ఎన్నో పరీక్షలు పెడుతుంటే... అదృష్టం కూడా తోడులేక కష్టాల్లో మునిగిపోతున్న ఓ నిరుపేద వికలాంగుడి బాధ ప్రతి ఒక్కరి మనసును కదిలిస్తోంది.జీవితంతో పోరాడుతూ కుటుంబాన్ని నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్న ఓ నిరుపేద వికలాంగుడు మానవతా దృక్పథంతో సహాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నాడు వేములవాడ పట్టణానికి చెందిన ఓదెల నరేష్ ప్రస్తుతం అద్దె ఇంట్లో నివసిస్తూ దిక్కుతోచని పరిస్థితిలో రోజులు గడుపుతున్నాడు. డిగ్రీ, ఐటీఐ వరకు చదువుకున్న నరేష్ శారీరక వికలాంగత్వం కారణంగా సరైన ఉపాధి దొరకక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. ఇంట్లో తల్లిదండ్రులు అనారోగ్యంతో మంచానికే పరిమితమవ్వడంతో కుటుంబ బాధ్యత అంతా అతని భుజాలపై పడింది. రోజు రోజుకు అప్పుల భారంతో జీవితం మరింత భారంగా మారిందని కన్నీరు పెట్టుకుంటూ తన ఆవేదన వ్యక్తం చేశాడు.

బతకాలని ఉంది... కుటుంబాన్ని పోషించాలని ఉంది... కానీ పరిస్థితులు సహకరించడం లేదు అంటూ నరేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. 2015 సంవత్సరం నుంచి కలెక్టర్ కార్యాలయం, వేములవాడ, కొండగట్టు దేవస్థానాల్లో ఎన్నో దరఖాస్తులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని వాపోయాడు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు మానవతా దృక్పథంతో తన పరిస్థితిని అర్థం చేసుకుని కొంత ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఒక శాశ్వత ఉపాధి కల్పిస్తే తన కుటుంబం రోడ్డుపాలు కాకుండా కాపాడగలమని నరేష్ ఆశతో వేడుకుంటున్నాడు. ఒక ఉపాధి ఇచ్చి మా కుటుంబాన్ని నిలబెట్టండి అనే అతని మాటలు ప్రతి ఒక్కరి మనసును తాకుతున్నాయి.



# చలో గన్ పార్క్‌కు సిరిసిల్ల నుంచి భారీగా తరలిన తెలంగాణ ఉద్యమకారులు..

**హామీల అమలుకు డిమాండ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ ఉద్యమకారుల పోరం ఆధ్వర్యంలో నిర్వహించిన “చలో గన్ పార్క్” కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి పెద్ద సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ గన్ పార్క్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపానికి ఉద్యమకారులు ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఆలస్యం చేయకూడదని కోరారు. అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల పోరం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, నాయకులు కర్నె లక్ష్మి, చిలుక శారద, గుగులోతు రేణు, చేరాల స్వాతి, సబ్బని శాంత, వనజ, కొక్కుల ఆంజనేయులు, గుజ్జె దత్తాద్రి, గజబీంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు. సిరిసిల్ల జిల్లా నుండి దాదాపు 500 మంది తెలంగాణ ఉద్యమకారులు ఈ కార్యక్రమానికి హాజరై తమ ఐక్యతను చాటారు.



# గండిలచ్చపేటలో సావిత్రిబాయి పూలే వర్ధంతి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గండిలచ్చపేట గ్రామంలో ఆడపిల్లల విద్యకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయ సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి నివాళులు సమర్పించారు. సమాజంలో ఉన్న అనేక రుగ్మతలను తొలగించి, ముఖ్యంగా ఆడపిల్లల చదువుకు మార్గం చూపిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే సేవలను ఈ సందర్భంగా పలువురు స్మరించారు. ఆమె చూపిన మార్గాన్ని అనుసరిస్తూ విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంగిటి అంజయ్య, పాక్స్ డైరెక్టర్ బండి దేవేందర్ యాదవ్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు బొండాల శ్రీశైలం, జంగిటి అనిల్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, స్కూల్ విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## రాజన్న సిరిసిల్ల జిల్లాలో రేపు మినీ జాబ్ మేళా

- నిరుద్యోగ యువతకు 40 ఉద్యోగ అవకాశాలు..
- జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మార్చి 12వ తేదీన గురువారం మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ సంస్థ VVC Motors Pvt Ltd సంస్థలో పలు విభాగాలలో ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఎలక్ట్రిక్ వెహికల్ సర్వీస్ టెక్నీషియన్ పోస్టులకు ITI (EL/DM/MMV), ఇంటర్ వోకేషనల్ లేదా డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. ఆటోమోటివ్ స్పేర్స్ పికర్స్ పోస్టులు 15 ఉండగా క్ష్మీక్ష్మీ లేదా ఇంటర్మీడియట్ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. టెలి కాలర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 15 ఉండగా ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ అర్హత అవసరం. యాక్సెసరీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 10 ఉండగా పదో తరగతి లేదా క్ష్మీక్ష్మీ అర్హత కలిగిన వారు హాజరుకావచ్చు.

అభ్యర్థుల వయస్సు 18 నుండి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,000 నుండి రూ.18,000 వరకు వేతనం అందించనున్నట్లు తెలిపారు. మొత్తం 40 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఈ మినీ జాబ్ మేళా మార్చి 12, 2026న ఉదయం 11:00 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయం, క్ష్మీణఉజ ఖీ16, రాజన్న సిరిసిల్లలో నిర్వహించబడుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా మరియు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని జిల్లా ఉపాధి అధికారి కోరారు. మరిన్ని వివరాల కోసం 7729992061, 9700302582 లేదా 9885346768 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.



## పాఠ్యాంశాలలో భారత రాజ్యాంగాన్ని చేర్చాలి..

- మాస్టర్ జి. రాజ్యాంగం అంజన్న

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ రాష్ట్రంలో ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు, అలాగే పై చదువుల్లో కూడా భారత రాజ్యాంగాన్ని ప్రత్యేక సబ్జెక్టుగా పాఠ్యాంశాలలో చేర్చాలని జై భీమ్ మహాసేన మానవ హక్కుల పరిరక్షణ సంఘం మరియు విశ్వజన కళామండలి విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో ప్రారంభించిన పాఠ్యాంశాలలో భారత రాజ్యాంగం రథయాత్ర 13వ జిల్లాగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న కెవిపిఎస్, బహుజన సేన మరియు వివిధ ప్రజా సంఘాల నాయకులు రథయాత్ర బృందాన్ని ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యాంశాలలో భారత రాజ్యాంగాన్ని చేర్చి ప్రజలందరికీ రాజ్యాంగం గురించి అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు మెమొరాండం సమర్పించి తమ డిమాండ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ పరిశీలిస్తామని తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ కమాండర్ మాస్టర్ జీ, రాజ్యాంగం అంజన్న, జై భీమ్ మహాసేన మానవ హక్కుల పరిరక్షణ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్తేరు రాణి, సలహాదారులు వై. అలెగ్జాండర్ ప్రభు, బాలస్వామి, ఉపాధ్యక్షురాలు యాదక్క, రాబర్ట్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, బహుజన సేన వ్యవస్థాపకులు జింక శ్రీధర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి నిర్వహణ

**బలగం టీవీ, కమాన్‌పూర్**

భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘ సంస్కర్తగా సావిత్రిబాయి పూలే నిలిచారని వక్తలు పేర్కొన్నారు. కమాన్‌పూర్ మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతిని సామాజిక కార్యకర్త చిప్పకుర్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్త్రీ విద్య, సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని గుర్తుచేశారు. ప్లేగు వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తూ ప్రాణాలు కోల్పోయిన ఆమె త్యాగం చరిత్రలో చిరస్మరణీయమని తెలిపారు. ఆధునిక మహిళా విద్య విప్లవానికి మార్గదర్శిగా నిలిచిన ఆమె కుల వివక్షకు వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహాలు మరియు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. సావిత్రిబాయి పూలే జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆమె చూపిన మార్గంలో సమాజ సేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లబెల్లి శంకర్, నాయకులు రాణవేణ లక్ష్మణ్, వెంకట్ రెడ్డి, అంబటి కనుకయ్య, కుక్క రవీందర్, మాసు భీమయ్య, మట్ట నర్సయ్య, గర్రెపెల్లి వెంకటి, చిప్పకుర్తి శ్రీనివాస్, చాట్ల రాయమల్లు, కాస రవి, లల్లు, సయ్యద్ ఇక్బాల్, మల్యాల శేఖర్, ఆరెళ్లి పేరయ్య, మట్ట రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల-తంగళ్లపల్లి బ్రిడ్జి దిగ్బంధించిన రైతులు

- ఎల్ ఎం-6, ఎల్ ఎం-4 కెనాల్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మానేరు బ్రిడ్జిపై రాస్తారోకో
- మద్దతు తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి...

**బలగం టీవీ, సిరిసిల్ల:**



తంగళ్లపల్లి మండలంలోని రైతుల సాగునీటి గోస తీరడం లేదు. 11వ ప్యాకేజీ కింద చేపట్టాల్సిన ఎల్ ఎం-6, ఎల్ ఎం-4 కెనాల్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైతులు ఉగ్రరూపం దాల్చారు. సిరిసిల్ల -- తంగళ్లపల్లి మానేరు వాగు బ్రిడ్జిపై భారీ ఎత్తున ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి తమ మద్దతు ప్రకటించి పాల్గొన్నారు.

ధర్నా సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. రంగనాయక సాగర్ ద్వారా కెనాల్ నిర్మాణ పనులకు రూ. 3 కోట్ల నిధులు కేటాయించినప్పటికీ, నేటికీ పనులు ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ నిర్లక్ష్యం వల్ల సుమారు 15 గ్రామాలకు చెందిన 10 వేల ఎకరాల భూమి సాగునీరు అందక ఎండిపోతోందని మండిపడ్డారు. నిధులు మంజూరైనా భూసేకరణ పనులను ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని ఆయన ప్రశ్నించారు. రైతులు దీక్షలు చేస్తున్నా పాలకుల తీరులో మార్పు రావడం లేదని, బిజెపి ఎల్లప్పుడూ రైతు పక్షాన నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు. కాగా, ధర్నా చేస్తున్న రైతులను మరియు బిజెపి నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసుల అరెస్టులతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# హామీ ఇచ్చిండు... అమలు చేసిండు..

- బాధిత కుటుంబానికి అండగా కేటీఆర్
- మృతుడి పిల్లల కోసం రూ.2 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన కేటీఆర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన సాయిల కిషన్ కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై మృతి చెందిగా వారి కుటుంబాన్ని సోమవారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పరామర్శించారు. కిషన్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని, సాయిల కిషన్ గౌడ్? ఇద్దరు పిల్లల పేరు మీద చెరో రూ. లక్ష చొప్పున పిక్సిడ్ డిపాజిట్ చేయిస్తానని హామీ ఇవ్వగా ఇచ్చిన మాట ప్రకారం... మంగళవారం బ్యాంక్ లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి డిపాజిట్ పత్రాలను కిషన్ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. సర్పంచ్ దుబ్బాక రజిత రమేష్, ఉపసర్పంచ్ మొగిలి కరుణాకర్ , మాజీ ప్యాక్స్ చైర్మన్ కోడూరి భాస్కర్, నాయకులు బండి శ్రీనివాస్, పూసపెల్లి సరస్వతి, నర్రా సతీష్ రెడ్డి, అఫ్రోజ్,అబ్బాడి తిరుపతి రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం వేళ పలు కార్యక్రమాలు చేపట్టిన టీడీఎఫ్



- సిరిసిల్లలో మహిళలకు శిక్షణ, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు
- మహిళలు స్వావలంబన దిశగా ముందుకు రావాలి: కలెక్టర్ గరిమ అగర్వాల్
- టీడీఎఫ్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ యంత్రాలు, సర్టిఫికెట్లు పంపిణీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం (టీడీఎఫ్) వనిత చేయుత ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లాలోని అప్పారెల్ పార్క్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి, జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ గీత, సిరిసిల్ల అప్పారెల్ పార్క్ ఏడి సంతోష్, టీడీఎఫ్ ఇండియా అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్ రెడ్డి, టీడీఎఫ్ వనిత చేత అధ్యక్షురాలు టి. వాణి, టీడీఎఫ్ జనరల్ సెక్రటరీ వినీల్, టెక్సపోర్ట్ కంపెనీ రీజినల్ హెచ్ఆర్ సాగర్, లోకల్ హెచ్ఆర్ మధుకర్, సమర్థ ట్రైనర్ సునీత తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.డీఆర్‌డీఏ సహకారంతో ముస్తాబాద్ మండలంలోని తొమ్మిది గ్రామాల నుంచి ఎంపిక చేసిన మహిళలకు పంచువేట్ టెక్స్టైల్ పార్క్‌లో ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సిరిసిల్ల అప్పారెల్ పార్క్‌లోని మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్ ఆధ్వర్యంలో నడుస్తున్న శిక్షణ కేంద్రంలో మహిళలకు ట్రైనింగ్ ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలని, ప్రభుత్వం, ఇతర సంస్థలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత కాలంలో ఖర్చులు పెరిగిన నేపథ్యంలో కుటుంబ ఆర్థిక స్థిరత్వం కోసం మహిళలు కూడా ఉద్యోగాలు లేదా వ్యాపార రంగంలో ముందుకు రావాలని ఆమె పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు తమ ప్రతిభను నిరూపించుకుని అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. టీడీఎఫ్ ఇండియా అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. 25 సంవత్సరాలుగా టీడీఎఫ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా వనిత చేయుత ప్రాజెక్ట్ ద్వారా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సిరిసిల్ల ప్రాంతంలో మహిళలు ఎక్కువగా బీడీ పరిశ్రమ, వ్యవసాయ రంగంపై ఆధారపడుతున్నారని, బీడీ చుట్టడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్న నేపథ్యంలో వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో గత మూడు సంవత్సరాలుగా ముస్తాబాద్ మండలంలో కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చి ఉచిత కుట్టుమిషన్లు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే అప్పారెల్ పార్క్‌లోని కంపెనీల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను మహిళలు వినియోగించుకోవాలని సూచించారు.

పంచువేట్ కంపెనీలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై కంపెనీ హెచ్ఆర్ మధుకర్, సీనియర్ విపి హెచ్ఆర్ సాగర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆసక్తి ఉన్న మహిళలకు కంపెనీ ద్వారా శిక్షణ అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న మహిళలను టీడీఎఫ్ సత్కరించింది. సిరిసిల్ల ప్రాంతానికి చెందిన చేనేత కార్మికురాలు రేఖను జిల్లా కలెక్టర్ సత్కరించారు. ఆమె మూడు నెలల పాటు కష్టపడి తయారు చేసిన "నారీ శక్తి" చేనేత చీర అందరినీ ఆకట్టుకుంది. అలాగే బాటిక్ కళాకారిణి యాసాల మమతను కూడా కలెక్టర్ చేతుల మీదుగా సత్కరించారు. ఆమె యువతకు బాటిక్ ఆర్ట్‌పై శిక్షణ ఇచ్చి ఈ కళను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.